పేకాడిన పది మందిపై కేసు

వాంకిడి, నవంబర్ 24: మండలంలోని బంబార గ్రామ శివారులో పేకాడుతున్న పది మందిని పట్టుకున్నట్లు వాంకిడి ఎస్ఐ ప్రశాంత్ తెలిపారు. పేకాడుతున్నట్లు సమాచారం రావడంతో ఆదివారం సాయంత్రం 4 గంటలకు బంబార గ్రామ శివారులో పేకాట స్థావరంపై ఎస్ఐ ఆధ్వర్యంలో దాడి చేశారు. పేకాడుతున్న పది మందిని పట్టుకొని రూ.4,500 నగదును స్వాధీనం చేసుకొని, వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలో ఎక్కడైనా పేకాడినట్లు తెలిస్తే ఎస్ఐ సెల్. 87126 70531 నంబర్, లేదా 100 నంబర్ సమాచారం ఇవ్వాలని కోరారు. ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్ష

నస్పూర్, నవంబర్ 24 : జిల్లాలో ఆదివారం నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ స్కీం(ఎన్ఎంఎంఎస్) పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని డీఈవో యాదయ్య తెలిపారు. జిల్లాలోని నాలుగు పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. మొత్తం 1042 మంది విద్యార్థులకు గాను 999 మంది హాజరయ్యారని, 43 మంది గైర్హాజరయ్యారని, 95.8 శాతం హాజరు నమోదైందని తెలిపారు.

బాక్సింగ్ పోటీలకు ఎంపిక

నస్పూర్, నవంబర్ 24 : ఇటీవల జరిగిన ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో అండర్-14 విభాగంలో శ్రీనాథ్ గోల్డ్‌మెడల్ సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎస్జీఎఫ్ సెక్రటరీ ఫణిరాజ్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని డీవైఎస్ఓ రాజ్‌వీరు, కోచ్ రాజేశ్ అభినందించారు.

27న టచ్ రగ్బీ ఎంపిక పోటీలు

సీసీసీ నస్పూర్, నవంబర్ 24: ఈ నెల 27న సీసీసీ నస్పూర్‌లోని కేజీఏ డిఫెన్స్ అకాడమీ గ్రౌండ్‌లో ఎస్జీఎఫ్ జోనల్ స్థాయి అండర్-14 బాలబాలికల టచ్ రగ్బీ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా పాఠశాలల క్రీడల ప్రధాన కార్యదర్శి చెరుకు ఫణిరాజా, రగ్బీ జిల్లా అధ్యక్షుడు చిట్ల సత్య నారాయణ ఆదివారం పేర్కొన్నారు. పోటీలకు జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులతో పాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా క్రీడాకారులు అర్హులన్నారు. పోటీల్లో పాల్గొనే పాఠశాలల హెచ్ఎంలు, ప్రిన్సిపాల్స్ నుంచి బోనఫైడ్ సర్టిఫికేట్, ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకురావాలన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు జనవరి 1వ తేదీ 2011 తర్వాత జన్మించిన వారై ఉండాలని తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా రగ్బీ అసోసియేషన్ కార్యదర్శి ఆవునూరి మహేశ్ సెల్ నం. 9492844476 సంప్రదించాలన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఉద యం 9 గంటలలోపు రిపోర్ట్ చేయాలని కోరారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

BUSINESS OFFER

★సిబిల్ స్కోర్ పెంచబడును ఇంటి పై లోన్ / ఓపెన్ ప్లాట్ లోన్ / బిజినెస్ లోన్/పర్సనల్ లోన్ పెద్దపల్లి సంప్రదించవలసిన సెల్ నెంబర్ : 9346756075

NTK-325449

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన

నమస్తే తెలంగాణ

క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం

200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి

50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679

బెల్లంపల్లి: 91827 77671, 91827 77677

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి

విద్యార్థులతో మాట్లాడుతున్న నీరటి రామ్ ప్రసాద్

నస్పూర్, నవంబర్ 24 : సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, లేదంటే ఆందోళన చేస్తామని నవతరం స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రామ్ ప్రసాద్ తెలిపారు. ఆదివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలితో వణుకుతున్నప్పటికీ విద్యార్థులకు దుప్పట్లు అందించడం లేదన్నారు. కాలేజీకి దూరంగా అద్దె భవనంలో హాస్టల్ కొనసాగిస్తున్నారని, దీంతో విద్యార్థులు కాలేజీకి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వేడినీళ్లు లేకపోవడంతో చల్లని నీటితో స్నానాలు చేస్తూ అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆశిష్‌కుమార్, అమోఘ్, రాకేశ్, తిరుపతి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

మంచిర్యాల అర్బన్, నవంబర్ 24: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీ(ఐ)ఎం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు పైళ్ల ఆశయ్య అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని చార్వాక హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించి, ఆరు గ్యారెంటీల అమలు చేయడాన్ని పట్టించుకోవడం లేదన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ప్రజా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ సర్కారు ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తూ, రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధులు ఇవ్వడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సంకె రవి, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక

బెల్లంపల్లి, నవంబర్ 24 : తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల సెంట్రల్ ఆఫ్ ఎక్సలెన్సీ ఎనిమిదవ తరగతికి చెందిన విద్యార్థి పొట్ట లక్ష్మీనరసింహ అండర్-14 విభాగంలో రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థిని అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీధర్, వైస్ ప్రిన్సిపాల్ విజయసాగర్, ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఫణిరాజు, పీఈటీలు అల్లూరి వామన్, ముచ్చకుర్తి రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది కలిగించొద్దు

తాండూర్, నవంబర్ 24 : తాండూర్‌లో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల స్పెషల్ ఆఫీసర్ కట్కం అంజయ్య ఆదివారంఎంపీడీవో పీ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ వీవీఆర్‌కేడీ ప్రసాద్ తో కలిసి పరిశీలించారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతుల నుంచి ఎలాంటి ఫిర్యాదు రాకుండా చూసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు.

వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కన్నెపల్లి, నవంబర్ 24 : మండలంలోని జన్కాపూర్, వీగాం, కన్నెపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం మండల వ్యవసాయాధికారి ప్రశాంత్, పీఏసీఎస్ చైర్మన్ పోతరాజుల నారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కన్నెపల్లి, భీమిని మండలాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

టీపీయూఎస్ అధ్యక్షుడిగా పుల్గం తిరుపతి

తిరుపతికి నియామక పత్రం అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వర్

తాండూర్, నవంబర్ 24 : తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం (టీపీయూఎస్) మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా తాండూర్ మండలానికి చెందిన పులగం తిరుపతిని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు మియ్యాపురం నాగేశ్వర్ నియామక పత్రాన్ని అందజేశారు. వ్యవస్థాపక అధ్యక్షుడు సామ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుని ఎన్నిక జరిగినట్లు తెలిపారు. అధ్యక్షుడిగా ఎన్నికైన పుల్గం తిరుపతి మాట్లాడుతూ ప్రైవేట్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

అథ్లెటిక్స్‌లో ప్రతిభ

చెన్నూర్, నవంబర్ 24: మంచిర్యాలలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో చెన్నూర్ పట్టణంలోని శార్వాణ్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచారని పాఠశాల కరస్పాండెంట్ మేడ శ్రావణ్‌రెడ్డి ఆదివారం తెలిపారు. అథ్లెటిక్స్ పోటీల్లో పాఠశాల నుంచి పాల్గొన్న 21మంది విద్యార్థుల్లో ఏడుగురికి బంగారు పతకాలు, 8 మంది వెండి పతకాలు, ఆరుగురు రజత పతకాలు సాధించారని తెలిపారు. పతకాలను సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ మేడ శ్రావణ్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీజన్, ఉపాధ్యాయులు స్వామి, నాగుల మహేశ్ అభినందించారు. క్రీడల్లో విద్యార్థులు ప్రతిభ సాధించేందుకు సహకరించిన రిటైర్డ్ పీఈటీ రామయ్యకు పాఠశాల తరుపున వారు కృతజ్ఞతలు తెలిపారు.

దవాఖాన నిర్మాణానికి స్థల పరిశీలన

మంచిర్యాల అర్బన్, నవంబర్ 24: మంచిర్యాలలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న కానున్న క్యాన్సర్, ఆయుష్ దవాఖాన నిర్మాణ స్థలాన్ని అధికారులతో కలిసి మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేం సాగర్‌రావు ఆదివారం పరిశీలించారు. అనంతరం సాయికుంటలో 12 ఎకరాల్లో చేపడుతున్న ఇండోర్ స్టేడియం స్థలాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డితో కలిసి పరిశీలించారు. హాజీపూర్ మండలం గుడిపేట ఎల్లంపల్లి ప్రాజెక్ట్ వద్ద జాతీయ స్థాయి చేపల పెంపకం 30 ఎకరాల్లో ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. కేంద్రానికి రూ.45కోట్లు, రాష్ట్రానికి సంబంధించి రూ.15 కోట్లు వ్యయం చేయనున్నట్లు వెల్లడించారు. 40 ఎకరాల్లో ఆక్వా కల్చరల్ ఏర్పాటుకు ఆమోదం తెలుపగా ఇందులో రూ.35 కోట్లు కేంద్రం, రూ.25కోట్లు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించనున్నట్లు తెలిపారు. ఇది దేశంలోనే తొలి కొర్రమొట్టల ఫిష్ పాండ్ అని అన్నారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డా మాట్లాడుతూ మంచిర్యాలలో నిర్మించబోయే స్టేడియం ఇంటర్ నేషనల్ స్థాయిలో నిర్మించనున్నట్లు రూ.9.50కోట్లతో 400 మీటర్లు సింథటిక్ ట్రాక్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ఫిష్ పాండ్ నిర్మాణానికి స్థల పరిశీలన

హాజీపూర్, నవంబర్ 24 : మండలంలోని గుడిపేట గ్రామ శివారులోని ఎల్లంపల్లి ప్రాజెక్టు సమీపంలోని మిషన్ భగీరథ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని చేపల పెంపకం కోసం ఫిష్ పాండ్ నిర్మాణానికి స్థలాన్ని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావ్ పరిశీలించారు.

సర్వేలో వివరాల నమోదు కీలకం

నస్పూర్ /ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, నవంబరు 24 : సమగ్ర కుటుంబ సర్వే వివరాలను పోర్టల్‌లో స్పష్టంగా నమోదు చేయడం కీలక ప్రక్రియ అని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు పోషక విలువలతో కూడిన నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. ఈ సమావేశంలో మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులు పాల్గొన్నారు. ఆసిఫాబాద్‌లోని కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా , అధికారులు పాల్గొన్నారు.

ఆదివాసీ తెగల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది

- ఏజెన్సీలో 1/70 చట్టం అమలు చేయాలి
- కుమ్రం భీం మనవడు సోనేరావు
- పోతేపల్లిలో భీం విగ్రహావిష్కరణ

సమావేశంలో మాట్లాడుతున్న కుమ్రం భీం మనవడు కుమ్రం సోనేరావు

కుమ్రం భీం విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సోనేరావు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

పెంచికల్ పేట్, నవంబర్ 24 : ఏజెన్సీలో 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయడం లేదని, దీంతో ఆదివాసీల్లోని 9 తెగల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని కుమ్రం భీం మనవడు సోనేరావు ఆవేదన వ్యక్తం చేశాడు. ఆదివారం పెంచికల్‌పేట్ మండలంలోని పోతేపల్లి గ్రామస్తులు ఏర్పాటు చేసుకున్న కుమ్రం భీం విగ్రహాన్ని ఆయన మనుమడు కుమ్రం సోనేరావుతో కలిసి సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు, ఎమ్మెల్సీ దండే విఠల్ ఆవిష్కరించారు. అడవిని నమ్ముకున్న ఆదివాసీ బిడ్డలపై నిజాం సర్కారు చేసిన అరాచకాలపై కుమ్రం భీం వీరోచితంగా పోరాడి అమరుడయ్యాడని కొనియాడారు. అనంతరం కుమ్రం భీం మనవడు సోనేరావు మాట్లాడుతూ కుమ్రం భీం నుంచి నేటి వరకూ ఆదివాసులు తమ అస్తిత్వం కోసం పోరాడుతునే ఉన్నారని, ఏజెన్సీలో 1/70 చట్టం నేటికీ అమలు చేయడం ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 9 ఆదివాసీ తెగల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతకుముందు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, కుమ్రం భీం మనువడు, జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులకు గ్రామస్తులు భాజా భజంత్రీలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సీతా రాం, గోండ్వానా జాతీయ ఉపాధ్యక్షుడు సిడెం అర్జున్ మాస్టారు, రాజ్‌గోన్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు బుర్సపోచయ్య, గోండ్ వాన కోయ సంఘం జిల్లా అధ్యక్షుడు సోయం చిన్నన్న, రాయి సెంటర్ అధ్యక్షుడు మోతీరామ్, మాజీ జడ్పీ చైర్మన్ సీడెం గణపతి, పెంచికల్‌పేట్ రాయి సెంటర్ అధ్యక్షుడు పోర్తేట్టి ప్రభాకర్ వివిధ మండలాల గోండ్ వాన నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు, మహిళలు, గ్రామస్తులు, యువకులున్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి, నవంబర్ 24 : మండలంలోని ఆకెనపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆదివారం మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ప్రారంభించారు. గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు తోకల రమేశ్ చిన్న కుమారుడు ప్రదీప్ స్మారకార్థం టోర్నమెంట్‌ను నిర్వహించారు. ప్రదీప్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం విచారకమని చిన్నయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ పొట్లపల్లి సుభాష్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాంచందర్, నియోజకవర్గ అధికార ప్రతినిధి కొమ్మెర లక్ష్మణ్, నాయకులు కాంపల్లి విశాల్, రాజేఖర్, గుర్రాల రాయమల్లు, కారుకూరి వెంకటేశ్, గణేశ్‌గౌడ్, పాయవేణి మల్లేశ్, పోల వేణి శ్రీనివాస్, రెడ్డిపోశం పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు 'ఎన్‌సీసీ' దోహదం

- మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్

మాట్లాడుతున్న మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్

మంచిర్యాల అర్బన్, నవంబర్ 24: ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు ఎన్‌సీసీ నిచ్చెన లాంటిదని మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన ఎన్‌సీసీ దినోత్సవ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఐకమత్యం, క్రమశిక్షణను ఎన్‌సీసీ నేర్పుతుందన్నారు. తాను ఇదే కాలేజీలో చదువుకొని ఎన్‌సీసీ క్యాడెట్‌గా శిక్షణ పొందానని తెలిపారు. ఎన్‌సీసీ క్యాడెట్లకు విద్యా ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఉంటాయని తెలిపారు. అనంతరం ప్రిన్సిపాల్ చక్రపాణి మాట్లాడుతూ ఎన్‌సీసీ స్టూడెంట్‌గా ఇక్కడే విద్యను అభ్యసించి 32 ఏళ్ల తర్వాత ఉన్నత స్థాయి అధికారిగా హోదాలో ముఖ్య అతిథిగా హాజరవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, సిబ్బంది, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కనక రాజు

కనక రాజు

కాసిపేట, నవంబర్ 24 : కాసిపేట మండలంలోని మద్దిమాడ గ్రామ పంచాయతీకి చెందిన కనక రాజు తుడుం దెబ్బ మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఇటీవల 20వ తేదీన ఉట్నూరులో జరిగిన ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ మహాసభల్లో మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర కన్వీనర్ బుర్స పోశయ్య తెలిపారు. కనక రాజు నియామకం పట్ల పలువురు ఆదివాసీ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

అభయాంజనేయస్వామి ఆలయ కమిటీ ఎన్నిక

మందమర్రి, నవంబర్ 24: మందమర్రి పట్టణంలోని మారుతీనగర్‌లోని అభయ ఆంజనేయస్వామి ఆలయ నూతన కమిటీని ఆదివారం ఆలయ కమిటీ చైర్మన్, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు బండి సదానందం సమక్షంలో ఎంపిక చేశారు. నూతన కమిటీ గౌరవ అధ్యక్షులుగా మూల రవీందర్ రెడ్డి, బండారి సత్యనారాయణ, నాగుల దుర్గయ్య, ఉపాధ్యక్షులుగా రాగిడి రాంరెడ్డి, కుంట తిరుపతి, ప్రధాన కార్యదర్శి మంచికట్ల రమేశ్, జాయింట్ సెక్రటరీ సిరిపురం లక్ష్మణ్, కోశాధికారి పెద్ది రాజన్న, లీగల్ అడ్వైజర్ మేకల రాజన్న, ఆర్గనైజింగ్ కార్యదర్శి మేకల శంకర్, కార్యవర్గ సభ్యులుగా నగేశ్, రాజశేఖర్, సదానందం, రాజయ్య, వీరేశం, కనకయ్య, రమేశ్, శ్రీను ఎంపికయ్యారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు చైర్మన్ సదానందంను శాలువాతో సన్మానించారు. నూతన కమిటీ సభ్యులను కాలనీ వాసులు సన్మానించారు.

విద్యుత్ మీటరు కోసం దరఖాస్తు చేసుకోండి



దరఖాస్తుల స్వీకరిస్తున్న ఏఈ శ్రీనివాస్

చెన్నూర్ రూరల్, నవంబర్ 24 : విద్యుత్ మీటరు ద్వారానే కరెంట్‌ను వాడుకోవాలని కొమ్మెర ఏఈ శ్రీనివాస్ తెలిపారు. కరెంట్ మీటర్ లేని వారి కోసం ప్రభుత్వం రూ. 825 తో కరెంట్ మీటర్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందులో భాగంగా కొమ్మెర గ్రామంలో ఆదివారం ఏఈ శ్రీనివాస్ ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేసి మీటర్లు లేని వారు నూతన మీటర్లను అమర్చుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని సూచించారు.

గుప్త నిధుల తవ్వకాల ముఠా అరెస్ట్

గుప్తనిధుల తవ్వకాల నిందితులతో ఎఫ్ఆర్వో అనిల్ కుమార్

పెంచికల్ పేట్, నవంబర్ 24: గుప్త నిధుల తవ్వకాలకు పాల్పడుతున్న ముఠాను అరెస్ట్ చేసినట్లు పెంచికల్ పేట్ అటవీశాఖ ఎఫ్ఆర్వో అనిల్ కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆదివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. పెంచికల్‌పేట్ మండలంలోని లోడ్పల్లి బీట్ పరిధిలోగల సిద్ధేశ్వర గుట్ట వద్ద శనివారం సాయంత్రం అనుమానాస్పదంగా కొందరు తిరుగుతున్నారని సమాచారం అందింది. అటవీ శాఖ అధికారులు అక్కడికి చేరుకొని ఏడుగురిని అదుపులోకి తీసుకొని రేంజ్ కార్యాలయానికి తరలించి విచారించారు. రెండు కార్లలో వచ్చి సిద్ధేశ్వర గుహల్లో తవ్వకాలకు వచ్చినట్లు నిందితులు పొగిడే వసంతరావు, కొట్టే ప్రవీణ్ కుమార్, ఆలకుంట వెంకన్న, దావా సురేందర్, వెంకన్న, నల్వాల అంజన్న, గడిపల్లి రమేశ్ ఒప్పుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో డీఆర్వోలు జమీల్ అహ్మద్, అబ్దుల్ ముసవీర్, ఎఫ్ఎస్వోలు ఆస్మా, వేణుగోపాలరావు, ఎఫ్‌బీవోలు లచ్చన్న, మహేశ్, సతీశ్, వాచర్లు పాల్గొన్నారు.

కన్నెపల్లిలో పాడుబడ్డ ఇంట్లో తవ్వకాలు..

చెన్నూర్ రూరల్, నవంబర్ 24: చెన్నూర్ మండలంలోని కన్నెపల్లిలోని పాడుబడ్డ ఇంట్లో గుప్త నిధుల తవ్వకాలు కలకలం రేపాయి. కన్నెపల్లి గ్రామంలో ఆదివారం పాడుబడ్డ ఇంట్లో ఇంటి యజమాని ఆధ్వర్యంలో గుప్త నిధుల తవ్వకాలను చేపట్టారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే కన్నెపల్లి గ్రామానికి వెళ్లి పరిశీలించగా.. గుప్త నిధుల తవ్వకాలను చేపడుతున్న నలుగురిని పూజా సామగ్రితో పాటు ఒక్క ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రవీందర్ తెలిపాడు. మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు తెలిపారు. గతంలోనూ ఈ ఇంట్లో నిధుల కోసం తవ్వకాలు చేపట్టినట్లు గ్రామస్తులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రవీందర్ తెలిపారు.

కార్తీక వనభోజనాలు

మంచిర్యాల అర్బన్, నవంబర్ 24: మంచిర్యాలలోని ఏసీసీ క్వారీ ఏరియాలో మంచిర్యాల కమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, గార్లపాటి దామోదర్ నాయుడు కమ్మవారి ప్రాముఖ్యతను వివరించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు, పోలీసులు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కమ్మ సేవా సమితి అధ్యక్షుడు వడ్డె వినయ్ కుమార్, గౌరవ అధ్యక్షుడు డా.కొల్లి విష్ణువర్ధన్ రావు, కార్యవర్గ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

అయ్యో పాపం..

- ట్రాక్టర్ కింద పడి బాలుడి మృతి
- దేవాజీగూడలో విషాదం

రిశాన్(ఫైల్)

దహెగాం,నవంబర్24: ట్రాక్టర్ కిందపడి ఐదేళ్ల పసి బాలుడు మృతి చెందిన విషాద ఘటన మండలంలోని బీబ్రా గ్రామపంచాయతీ పరిధిలోని దేవాజీగూడలో ఆదివారం జరిగింది. బాలుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..ఆర్మీజవాన్ సదువల కృష్ణ, అనిత దంపతులకు ఇద్దరు కుమారులు. వీరి చిన్న కుమారుడు రిశాన్ ఆదివారం సాయంత్రం ఇంటి సమీపంలో ఆడుకుంటున్నాడు. అదే సమయంలో ట్రాక్టర్ రావడంతో ప్రమాదవశాత్తు బాలుడు ట్రాక్టర్ ట్రాలీ వెనుక టైర్ కింద పడిపోయాడు. ప్రమాదాన్ని గమనించి వెంటనే ట్రాక్టర్‌ను నిలిపివేసి బాలుడిని బయటకు తీసి చూడగా తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కాగజ్‌నగర్ దవాఖానకు తరలించగా అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు ఎస్ఐ కందూరి రాజు ఘటన స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలు సేకరించారు. బాలుడి బాబాయి సదువుల ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. అప్పటివరకు ఆడుకుంటూ కనిపించిన కుమారుడు ట్రాక్టర్ కిందపడి మృతి చెందడంతో తల్లి అనిత రోదనలు గ్రామస్తులు, బంధువులను కంటతడి పెట్టించాయి. రిశాన్ తండ్రి కృష్ణ సెలవుపై వచ్చి వారం క్రితమే తిరిగి జమ్ముకు వెళ్లాడు.

మహంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు

మహంకాళి దేవస్థానంలో పూజలు చేస్తున్న భక్తులు

రెబ్బెన, నవంబర్ 24: రెబ్బెన మండలం ఇందిరానగర్‌లోని కనకదుర్గాదేవి స్వయంభూ మహంకాళి దేవస్థానంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్తీక మాసం పురస్కరించుకొని భక్తులు అమ్మవారికి ఒడి బియ్యం, నైవేద్యం, పట్టు వస్త్రాలు, త